# కిరణం సోకిన కమలం

రాధ పుట్టింటి కొచ్చి పదిరోజులకు పైనైంది. ఈ పది రోజుల నుండీ తానేం జేస్తున్నదీ, ఎలా వుంటున్నదీ తనకే తెలియటం లేదు. భర్తమీదైతే తగువు పెట్టుకొచ్చింది కానీ, తన మనస్సు మనస్సులో లేదు. ఏవేవో పిచ్చి పిచ్చి ఆలోచనల్ల తోనే సతమతమౌతుంది. ఎంత మనస్సు నిలువుకొందామనుకొన్నా తన భర్త ప్రవర్తనే జ్ఞాపకం వస్తోంది. ఎంత కాదనుకొన్నా ఆయనగారిని గూర్చిన ఆలోచనలతోనే బుర్ర నిండుతోంది. ఏ పని చేయటానికి తోచటం లేదు. మనస్ఫూర్తి పనిమీద లగ్నమైతేకదా చేయటానికి. తన మనస్సుని తనాధీనంలోకి తెచ్చుకోలేక పోతోంది. తన భర్త 'ఛీ! ఒట్టిదగా కోరు, మోసగాడు. ఎంత నాటక మాడుతున్నాడు, అగ్నిసాక్షిగా పెళ్ళయిన భార్య ఉండగా పరస్త్రీలతో ఎంత కులుకుతున్నాడు. ఎంత నవ్వులతో మాట్లాడుతున్నాడు. ఎంత నీచంగా ప్రవర్తిస్తున్నాడు. ఇవతల పెళ్ళామున్నదన్న సంగతే మర్చిపోయి దానితో, ఎంత విచ్చలవిడిగా స్వేచ్ఛగా.. ఛీ! ఆలోచించాలంటేనే అసహ్యంగా వుంది. అది తిన్నగా ఇంటికే వచ్చింది. డబ్బు నాకళ్ళ ముందే తీసుకెళ్ళింది. ఎంత బరి తెగించిన ఆడది. ఆమెననడం దేనికి అయ్యగారి ననాలిగానీ, ఒకరోజు ఇంటికి రావటం ఆలశ్యమైంది. అది

రాజేష్.

గితే ఎవరో స్నేహితుడింటి కెళ్ళా నన్నాడు. నమ్మి ఊరుకొన్నా. కాని అప్పటినుండి అలక్ష్యంగా ఇంటికి రావటం మొదలెట్టారు. అదే మంటే ఆఫీసుపనెక్కువైదన్నాడు. నిజమే ననుకొన్నా, కాని మొన్న జరిగిన సంఘటనతో ఇదంతా నాటకమనీ; చెప్పేవన్నీ ఒట్టి గాలి కబుర్లనీ తెలుసుకొన్నా. కలకండ చూపి కషాయం తాగించాలను కొంటున్నాడు, నేనేమంత తెలివి తక్కువదాన్ననుకొన్నాడో ఏమో! ఎంతందగాడో అంత మోసగాడు. అయ్యగారికి బాహ్యసౌందర్యమైతే ఉందిగానీ, ఆ సౌందర్యమనే పరదా చాటున ఇంత వికృతమైన, భయం కరమైన అంతరంగిక సౌందర్య ముందంటే - ఛీ! ఛీ!' ఇంకేమాత్రం ఆలోచించలేకపోయింది!

'తల బ్రద్దలై పోతూంది. నా జీవితం నాశనమైంది. నా బ్రతుకు చీకటైపోయింది' కళ్ళవెంట నీరు ధారలు కడుతోంది. తలగడలో ముఖం పెట్టుకొని గుండె బ్రద్దల య్యేలా ఏడ్చింది. ఏడ్చి, ఏడ్చి నిద్ర పోయిన రాధ లేచేసరికి, తల్లి ఒక పొడుగాటి కవరు చేతి కిచ్చింది. అడ్రసు తనదే! కేరాఫ్ మీద వచ్చింది. 'ఆయనే రాసుంటాడు. ఇంకా సిగ్గన్నా లేదు. ఏ మొఖం పెట్టుకొని రాశాడు' కోపం వెళ్ళ గక్కింది. ఉత్తరాన్ని చించి ముక్కలు చెయ్యాలనుకొంది. క్రింది పెదవి బిగబట్టి కోపం వెళ్ళగక్కింది —నీ అవేమీ చేయలేక అప్రయ త్నంగానే చించి చదువ నారం భించింది.

'డియర్ రాధా!

నీవు నాపై కోపంతో వెళ్ళిపో యావు. నీవు వెళ్ళిన తరువాత ఏర్ప డిన ఈ ఒంటరితనం భరించనంత భయంకరంగా వుంది. నువ్వుండి కూడ నాకీ ఒంటరితనం ఎందుకు? ఎంతవేదనతో దహించుకు పోతు న్నానో, ఎంత మానసికాందోళ నతో సతమతమౌతున్నానో, ఎంత హృదయ భారంతో కృంగి పోతు న్నానో తెలుసా? ఈ మనస్తాపం నువ్వు నన్ను సరిగ్గా అర్థం జేసుకో లేకపోవటం వల్ల కలిగినదే. మని ద్దరి మధ్యా అనురాగాలకూ, అను బంధాలకే గానీ, అనుమానాలకు అవమానాలకు తావు లేదు. నాకు తెలుసు నువ్వెందు కెళ్ళిపోయావో. నీవు నా మనస్సు పూర్తిగా అర్థంజేసుకోలేక పోవటమే, అందుకు కారణం.'

'అర్థం జేసుకోలేదట అర్థం. ఇంకా ఏమని అర్థంజేసు కోవాలి' కోపంతో వుడికిపోయింది రాధ.

మొన్న రాత్రి జరిగిన సంఘట నతో నీవు రెచ్చిపోయావు. నీ సంకు చిత వనస్తత్వా న్నాధారం జేసి కొని, చిన్న సంఘటనలు భూతద్దం లోంచి చూస్తున్నావు నేను నీవు తలంచినంత బుద్ధిహీనుణ్ణికాను, నీవ నుకునేటంత ద్రోహిని కాను. ఈ ఈ ఉత్తరం సావధానంగా చదువు. నన్ను సరిగా అర్థంజేసికో. అంతే కాని ఆలోచనా రహితంగా అనుమా నాలకు నీమనస్సులో తావిచ్చి సం సారాన్న వమానాలు పాలుచెయ్యకు. అందులో వ్రాస్తున్న విషయాలు నా గుండెపై చేయి వేసి, నీపై ప్రమాణంచేసి మరీ వ్రాస్తున్నా! ఇందులో లేనివి కల్పించిగానీ, ఉన్నవి తీసేసి గానీ వ్రాయటం లేదు. నామాటనమ్ము. నామాట నమ్ము. ఆతరవాత నీవు నన్ను మంచివాడుగ గ్రహించినా, లేక మోసగాడిగా నైనా, దగాకోరుగా నైనా నమ్మినానసరే! నీఇష్టం. కానీ ఈ విషయాలు మాత్రం పూర్తిగా నమ్మితే చాలు.'

దడదడ లాడే గుండెనుండి బరు వుగా ఒక్క నిట్టూర్పు వెలువడింది.

'నీవు వెళ్ళినరోజు రాత్రి జరిగిన సంఘటన మనస్సులో చాలా మార్పు తీసుకొచ్చింది. నీలో చాల ఉద్రేకాన్నీ, కలవర పాటునూ తీసు కొచ్చింది. రాధా, ఆరోజు మనింటి కొచ్చినామె నా ఆఫీసులో పనిజేసు కొనే గుమాస్తా. కొద్ది జీతంతో పెద్ద ఇంటిని పోషిస్తుంది. చాల సౌమ్య మైనది. ఆమెనుగూర్చి ఒక్కమా టలో చెప్పాలంటే చాల ఉత్తము రాలు. వాళ్ళ కుటుంబ పరిస్థితులు వింటే జాలి పడతావు తప్ప నీకే ఆలోచనా రాదు. అటువంటామెను నీవు చాల అనుమానిస్తున్నావు.

ఆమెనిగూర్చి తక్కువగామాత్రం ఆలోచించవద్దు. లోకంలో అందరూ ఒక్కలాగ వుండరు. కాని నీ దృష్టిలో గుమస్తా బ్రతుకులీడ్చే ఆడ వాళ్లపై సదభిప్రాయ మున్నట్లు కని పించదు. ఒకరిని గూర్చి తేలిగ్గా ఆలోచించటం మంచిదిగాదు. వాళ్లను బాగా అర్థంజేసుకొని ఒక నిర్ణయా నికి రావడం మంచిది. అంతేగాని ఒక్కసారిగా ఒక నిర్ణయానికి రావటం మన మనస్సులోని అల్ప త్వాన్ని సూచిస్తుంది, ఆనాడు ఆమెతో మనింట్లో స్వేచ్ఛగా మాట్లాట్టం, ఆ తర్వాత ఆమెకు డబ్బిచ్చి పంపటం నీ మనస్సులోతీవ్ర పరిణామాన్ని తీసుకొచ్చింది. ఆమెకు కాస్త డబ్బు అవసరమైతే ఇచ్చాను అంతమాత్రానికే లేనిపోనివి కల్పిం చుకొని మనస్సులో పెడర్థాలు తీసు కొచ్చావు. ఆమె ఆత్మాభిమానాన్ని

చంపుకొని అడగలేక అడిగింది. అది ఎంతో అవసరమైతే తీసుకెళ్ళింది. అంతమాత్రానికే నీవు వివరీతార్థాలు తీసుకొన్నావు. నాకు తెలుసు నీ మనస్సంతకంటె ఎక్కువఆలోచించ లేకపోయిందని ఆపైన నేనప్పుడప్పు డింటి కాలస్యంగా రావటం ఈమధ్య తరచూ కేంపుల మూలాన ఇంటివద్ద ఉండకపోవటం నీకు మరీ అనుమా నాన్ని రేకెత్తించింది. ఆమెరావటం నీ మనస్సులో ఒక విషబీజాన్ని నాటితే, నేనింటి కాలశ్యంగా రావటం. ఒక్కోరోజున పనిమీద వెళ్తూండంతోటి ఆ బీజం మొలకెత్తి నీ హృదయాంతరాళంలో బాగా నాటుకొనిపోయింది. తిరిగి ఆమె మనింటికి, మళ్ళీ రావటంతో నీవు భరించలేకపొయ్యావు. నాతో వాద నకు దిగి వెళ్ళిపోయావు.

చూడు రాధీ! మన పెళ్ళయి కొద్దికాలమే అయినా, నన్నేమాత్రం అర్థంజేసుకోలేదంటే చాల విచారిం చాలి. ఎంత హాయిగా, ఆనందంగా అమరసౌఖ్యా లనుభవించాల్సిన ఈ రోజుల్లో అనుమానాలకు గురై, ఒకరి నుండొకరు దూరంగా, హృదయ భారంతో కాలం గడవటం ఎంత భరింపరాని నరకమో ఆలోచించు. నీవు నన్ను చాల తక్కువగా ఆలో చించావు. నేను నీవనుకొనేటంత నీచుణ్ణికాను. నీవు తలంచినంత పతి తుణ్ణి, మోసగాణ్ణి కాను. నామాట నమ్ము. నాలో మంచి అందముం దనీ. అందర్నీ ఆకర్షించే గుణం ఉందనీ అప్పుడప్పు డంటూవుండే దానివి, నాలో అందం, ఆకర్షణ ఉంటే ఉండవచ్చు. కాని వాటిని ఎరగా ఉపయోగించిమాత్రం వ్యవ రించటంలేదు. నేను ఏనాడూ ఒకో స్త్రీకి ద్రోహం చెయ్యాలనిగాని, చేసి గాని ఎరుగను. మొదటినుండీ నాది ఖచ్చితమైన జీవితం. నీవప్పుడప్పు డంటూవుండేదానివి. 'మిమ్మల్నెవ రైనా ఎత్తుకుపోతారేమో! పెంద లాడే ఇంటికిరండని!' నన్ను గూర్చిన భయం నీకుంది. నేనేదో కానిపని జేస్తానని, నిన్ను మోసంజేస్తానని. నీకలాంటి భయంవద్దని చాలాసార్లు చెప్పాను. ఆడదానికి ఈర్ష్య, అసూయ, అనుమానాలెక్కువ. నీలో అవి ఇంకొంచెం అధికంగా వున్న ట్లుంది. నాపై నీకొక ఖచ్చితమైన అభిప్రాయం కలుగలేకపోయింది. అందుకు కారణం నా వ్యవర్తనలో నీకు నమ్మకం లేకపోవటమే! అయినా నీవు నన్నర్థం జేసుకోగల వని ఆశించాను. నా మాటలు నమ్మ గలవనితలంచాను. కాని అది చేజారి పోయి ఎడమొగం పెడమొగం వరకూ వచ్చింది.

ఇప్పుడు అవసరం వచ్చింది కాబట్టి చెప్తున్నాను. జీవితం విషయంలో నాకొక స్థిరమైన అభిప్రాయం వుంది. జీవితం జీవించడానికే అనే వాళ్ళలో నేనూ ఒకన్ని. భార్యా భర్తలమధ్య అన్యోన్యం దినదినాభివృద్ధయి, మూడుపూవుల్లా, ఆరుకాయల్లా వుండాలిగానీ, అనుమానాలకు గురైతే ఆయింట్లో సుఖశాంతులుండవు. మనస్సులు కలవని జీవితాలు ఎన్నో అనర్థాలకు దారితీస్తవి. ఒకరికొకరు హృదయాలు తెలుసుకొని ప్రేమలు నింపుకొని, మమతలు పెంచుకొని జీవించటంలో గల ఆనందం ప్రపంచంలో ఎక్కడా కన్పించదు.

నన్ను గూర్చి నీవంత తేలిగ్గా ఎందుకాలోచిస్తున్నావో తెలియదు. నేనేమంత కానిపని జేస్తున్నానను కొంటున్నావు? నాపై నీకెందుకింత అనుమానం ఏర్పండిది? నన్ను నా భావాలను ఎందుకంత తేలిగ్గా ఆలోచిస్తున్నావు?

అయితే రాధా! నీకు కొన్ని సంగతులు వివరిస్తాను. అవి నా గత జీవితానికి సంబంధించినవి. అవి నీవు సహృదయంతో అర్థంజేసికో గలవనే రూఢి నమ్మకంతో చెప్తున్నాను. నాపై నీకొక స్థిర అభిప్రాయం ఏర్పడాలంటే, నన్నూ నామాటలూ, నాచేతలూ విశ్వసించాలంటే ఇవి నీవు తప్పకుండా తెలుసుకోవాలి.

రాధా! ఈ విషయాలు చెప్పాల్సి వస్తవనుకోలేదు. ఇప్పు డవసరం అనుకొంటున్నాను గనుక చెప్తున్నాను. నాకు వయస్సు ఊహ వచ్చిన దగ్గరనుండీ నన్ను కోరిన అబలలు, నా అందాన్ని పొగడుతూ, నా స్నేహాన్ని పొందనూ కోరిన స్త్రీ లెందరో వున్నారు. ఈ మాట అంటుంటే భయపడుతున్నావా రాధీ! భయపడకు. నాలో స్త్రీల నాకర్షించగల రూపమున్నదని తెలుసుకొన్న నాడు ఎంతో పొంగిపోయాను. నా పొందు కోరిన వాళ్ళను అందకుండా ఏడ్పించేవాడినేగాని వాళ్ళకు చిక్కేవాడిని కాను. లోకంలో కొంతమంది అందమైనవాళ్లు తమలో అందం, ఆకర్షణ ఉందని ఇతరులచేత తెలియజేయబడితే వాళ్ళెవరికీ లొంగరు. గర్వించి అందకుండా ఏడ్పించుతారు. వాళ్ళ కిదో సరదా. నేనూ అలాగే చేసేవాడిని. అందుకునే దారిన వెళ్తుంటే కిటికీలలోనుంచీ, తలుపు సందుల్లోనుంచీ చూస్తూ ఆనందించిన వాళ్ళను నేనెరుగుదును. ఇదంతా నాలో ఉన్న ఆకర్షణే కారణం. ఈమాట నిజం కావాలంటే నీ హృదయాన్నే అడుగు మనపెళ్లయిన 'అబ్బ! క్రొత్తలో ఎంతందంగా ఉన్నారండీమీరు!'

అనెన్నిసార్లు నా అందాన్ని పొగిడావో, ఎన్నిసార్లు దిష్టి తగులుతుందండీ మీకన్నావో గుర్తుందా? అలాగే వీళ్లూ నన్ను కోరుతూ లొట్టలువేసుకొన్నవాళ్ళే!

కానీ రాధా నేను ఇట్లా ఆడవాళ్ళచే ఆకర్షింపబడినా, ఏ స్త్రీకి ద్రోహం చెయ్యలేదు. ఏ స్త్రీని నమ్మించి మోసగించలేదు. ఇటువంటి పరిస్థితుల్లో నా యీ మాటలు నమ్మకపోవచ్చు. నీవేకాదు. ఇంకెవ్వరూ నమ్మకపోవచ్చు. నేను ఎలా అప్పటి పరిస్థితులకు తలవొగ్గకుండా నిలబడగలిగానో, ఎలా నిగ్రహించుకోగల్గానో, ఈనాడు తెల్సుకొంటే ఎంతో గర్విస్తున్నాను. నా జీవిత పరిధిలోనికి ప్రవేశించటానికి ప్రయత్నించిన వాళ్ళ మనస్తత్వాలు నా అభిప్రాయాలకూ, ఉద్దేశ్యాలకు విరుద్ధంగా వుండేవి. ఎంతమంది నా జీవిత గమనంలోకి అడుగుపెట్టాలనుకొన్నా వాళ్ళతోసాహసించి సహకరించలేకపోయాను. ముఖ్యంగా జ్యోతి విషయంలో. ఈమె సంగతి వింటే నిజంగా నామీద సదభిప్రాయమే కల్గుతుందో లేక ఇంకెక్కువ శంకిస్తావోగాని జ్యోతిలాంటి ఆడది నా అందానికి బానిసైందంటే నీవుమాత్రం గర్వపడాలి.

నేను కాలేజీలో చదివేటప్పుడు నా గదికొక ఉత్తరం వచ్చింది. దస్తూరి ఎవరిదో పరిచయమైనవ్యక్తిది కాదు. ఎవరు వ్రాశారంటారబ్బా! అంటూ చించి చదివాను. రెండే ముక్కలందులో వుంది. 'మిమ్ములను రోజూ చూస్తున్నాను. మీ అందం నన్ను పిచ్చిదానిలా చేసి మనస్సుకు మరోవైపు లాగుతుంది మీరుకూడ నన్ను ప్రేమించగలరని ఆశిస్తాను' అంతే! అంతకన్న ఏమీ లేదందులో అడుగున జ్యోతి అని సంతకం వుంది. అది లోకల్ లెటరు ఈమె ఎవరైందీ అర్థం జేసుకోలేకపోయాను. తిరిగి వారానికింకో లెటరు ప్రత్యక్షం ఈసారి ఆమె తన అడ్రసుతో సహా ఇస్తూ, తిరిగి నన్ను సమాధానమియ్యమని కోరింది, ఇప్పుడామెవరైందీ, ఎక్కడుండేది తెలుసుకోగల్గాను. ఆమె నా అడ్రస్సు ఎలా తెలుసుకుందోగాని, లోకల్ లెటర్సు చాలా చేరాయి. అన్ని ఉత్తరాలలో కూడ నేను మిమ్ములను ప్రేమించాను. మీరు కూడ నన్ను ప్రేమించండని వుండేది. నేను కాలేజీనుంచి వాళ్ళ ఇంటివైపునుండే రావాలి. కానీ నేనామె నెనాడూ పరీక్షగా చూడలెదు, తరువాతమాత్రం ఆమెను గమనిస్తూ వుండేవాడిని ఆమెవ్రాసిన ఉత్తరాలు చదివి నవ్వుకొనే వాడనే గానీ, తిరిగి సమాదానం వ్రాసే

వాడినిగాదు, అందీ అందకుండా ఏడ్పించేవాడిని. కన్పించీ కన్పించకుండా తిరిగేవాడిని. ఆమెకు సమాధానం వ్రాయాలనిగానీ, ఆమెను ప్రేమించాలనిగానీ ఏనాడూ తలంచలేదు. ఆమె ప్రతి ఉత్తరంలోనూ నా భౌతిక దేహానికీ, నా అందానికి విలువిచ్చిందే గానీ నాలోని మంచి చెడులను విచారించ లేకపోయింది. నా ప్రవర్త నెటువంటిదైనా అవసరం లేకపోయింది. ఆమెకు కావల్సింది మాత్రం నా అందం, ఆకర్షణ. నా అందాన్ని ప్రతి ఉత్తరంలోనూ పొగిడింది. నా వద్దనుండి ఒక్క ఉత్తరం కూడ చేరకపోయే సరికి ఆమెకు విసుగెత్తింది. కోపం వెళ్ళగక్కింది. ఉత్తరాలలో తిట్టింది. తన్ను తాను తిట్టుకుంది. వర్తమానంలో వుండి భవిష్యత్తును నెంతో తియ్యగా ఆలోచించింది. ఎన్నో కమ్మని కలలు కంది. ఎన్నో గాలిమేడలు కట్టుకుంది. కాని భవిష్యత్తు వర్తమానం కాగా, ఆశలు నిరాశలైన కట్టుకొన్న మేడలు కూలిపోయినై. కమ్మని కలలు కరిగిపోయినై. ఆమె ఇప్పుడెక్కడున్నదీ ఏం జేస్తున్నదీ తెలియదు.

కాలేజీ విడిచిపెట్టాను. మళ్ళీ నా జీవితంలోకి ప్రవేశించటానికి ప్రయత్నించిది లీల. ఈమె ఇంతే! నా భౌతికాకర్షణకు విలువిచ్చింది. భౌతిక దేహానికిచ్చినంత విలువ ఆత్మీయ సౌందర్యానికివ్వలేకపోయింది. నన్ను ప్రతిసారి ఉత్తరాల్లో వర్ణించింది. నా ప్రవర్తన సంగతే గ్రహించలేకపోయింది. నేనెటువంటివాడనైనా ఆమెకవసరం లేకపోయింది. అందుకనే ఆమెను నేను లెక్కచెయ్యలేకపోయాను ఇలా వీళ్ళనేడ్పించాలనుకోవటమేగాని, నా ఆకర్షణ చుట్టూ తిప్పాలనుకోవటమేగాని వీళ్ళను ప్రేమించాలనుకోలేదు.

కానీ రాధా నీవిప్పుడొక ప్రశ్నడుగవచ్చు. వీళ్ళిట్లా నీ ప్రేమభిక్షకోసం అర్థించి, నీ అందానికి దాసులై, ప్రేమించమని బ్రతిమలాడితే ఎందుకు వాళ్లను నిరాకరించి నిరాశ కల్గించావు? నీవేమైనా స్త్రీలనే ఎరుగని ఋష్యశృంగుడివా? పరస్త్రీలంటే ప్రక్కకు తిరిగిన ప్రవరాఖ్యుడవా? లేక ఆడదంటే అవసరం లేని బృహన్నలవా?

ఈ ప్రశ్నలకు సమాధానంచెప్పాలంటే ఒక్కమాటలో చెప్పలేను. వీళ్ళీవిధంగా నన్ను కోరినా ఏ వొక్కరితోను ఎట్టి జోక్యం కలుగజేసుకోలేదంటే కొంత ఆశ్చర్యాన్ని కలుగజేయవచ్చు. ప్రేమించమని మనలను ప్రాధేయపడి బ్రతిమాలితే

వాళ్ళపై మనకు సహజమైన ప్రేమ జనించదు. హృదయాలను కదలించి హత్తుకునే ప్రేమ ఏర్పడదు. అడిగి నన్ను ప్రేమించమనటంలో సహజత్వం లేదు. సహజమైన ప్రేమ హృదయాంతరాళంల్లోనుండి పెల్లుబికి రావాలి. హృదయాలను కదిలించి కలవరపెట్టి మధుర భావనలతో ఐరువెత్తించగల శక్తి నన్ను ప్రేమించమనటం లేదు. మనస్సును గిలిగింతలు పెట్టి పరవశత్వంలో వోలలాడించే ఏ దూరతీరాలకో, మధురలోకాలకో తీసుకెళ్ళగల శక్తి దానికిలేదు, ఊహామాత్రంగానే పులకించి పరవశించి మధుర బాధలో, తీయని వేదనలో మెత్తని జ్వాలల్లో వేధించగల శక్తి దానికిలేదు. రక్తంలోని అణువణువూ ప్రేమావేశంలో జివ్వుమంటూ పురకలేస్తూ వెర్రెత్తించే శక్తి నన్ను ప్రేమించమనటంలో లేదు, ఈ ప్రేమావేశం వాళ్ళల్లో వుండవచ్చు. కానిమనలో కూడ ఈ అనుభూతులూ, ఆవేశాలూ పరవళ్లు తొక్కాలి. రెండు హృదయాలూ ప్రేమోద్రేకంలో ఒక్కటిగా స్పందించాలి, అంతే!

వీళ్ళను జూస్తే ఏనాడూ అలాంటి భావాలూ, ఉద్రేకాలూకలుగలేదు. కావాలని ప్రేమించటంగానీ, ప్రేమించ జేసుకోటంగానీ చేస్తే వద్దనుకొన్నప్పుడు మాసిపోతుంది. పైగా వీళ్ళందరూ నా భౌతిక సౌందర్యాన్నారాధించారేగాని, నా గుణగణాలతో లెక్కలేకపోయింది. నేను తిరుగుబోతునైనా, తాగుబోతునైనా వీళ్ళకవసరం లేదు. వాళ్ళకు కావల్సిందల్లా నాలోని ఆకర్షణ మాత్రమే!

బాహ్య సౌందర్యం చిరకాలం వుండేదిగాదు. సంపూర్ణమైన ఆత్మీయ సౌందర్యం కావాలి. బాహ్యసౌందర్యం, ఆకర్షణ వున్నంతకాలం వాళ్ళలోని ఆరాధన, ప్రేమ మాసిపోతుంది. భౌతిక సౌందర్యం వున్నంతకాలం నిలిచే ఆ ప్రేమ ఏపాటి? దీపం వెలుగుతున్నంతసేపు దీపశిఖ అందానికి ఆకర్షింపబడి పురుగులు చేర్తాయి. కొడిగట్టిన దీపం దగ్గరకు ఒక్క పురుగ్గూడా చేరదు.

సౌందర్యం శాశ్వతమైనదికాదు. హద్దులూ అవధులూ లేవు దానికి. ఈ నాడున్న అందం రేపుండకపోవచ్చు. ఉదయాన్నే వికసించే పూవు సాయంకాలానికి వాడబారుతుంది. చల్లని, తెల్లని వెన్నెల విరజిమ్మే నిండు పున్నమి మరునాటికి క్షీణిస్తుంది. దేదీప్యమానంగా వెలిగే జ్యోతి కొంతకాలానికి కొడిగట్టి క్షీణిస్తుంది. అందానికి గీటు రాళ్ళు లేవుగా. అప్పుడు నాలో కన్పించే

ఈ అందం రేపు మాసిపోవచ్చు. లేక నాకంటె అందమైన వాడు రేపు కన్పించవచ్చు. ఈ నాడు ప్రేమించి,ఆరాధించే ఈ నాసౌందర్యాన్ని వదులుకోవలసిందేగదా! భౌతిక సౌందర్యారాధన కాగితం పువ్వును నిజమైనదిగా భావించటం లాంటిది. అది పైకి పువ్వులాగున్నా అది వికసించదు. పరిమళాన్ని వెదజల్లదు. రేపింకా అందమైన వాడు కనిపిస్తే నన్ను ప్రేమించటం మానేస్తారేమో నని అనుమానం మొదలైనప్పుడు వాళ్ళ నేవిధంగా ప్రేమించగలను? అందుకే వాళ్ళపై ఏమాత్రం మమకారాన్ని పెంచుకోలేక పోయాను. రాధా! నా లాంటి మగాణ్ణి వీళ్ళు కోరుకొంటే అది నా తప్పుగాదు. వాళ్ళ తప్పు.

ప్రతిస్త్రీ తనకు కాబోయే భర్త అందగాడు కావాలనీ, సుగుణ సంపన్నుడు కావాలనీ కోరుకుంటుంది. అనేక పూజలు చేస్తుంది. ముక్కోటి దేవతలకు మొక్కుకుంటుంది. స్త్రీకి కావల్సింది తన జీవితంలో అదొక్కటే! యవ్వనంలో అడుగు పెట్టి నునుసిగ్గుబుగ్గలపై దొర్లే ప్రతికన్నె మనసు కనే కలలే ఇవి. ఇదిప్రకృతి. ఇది సహజం. ఇటు వంటి కోర్కె పెళ్ళిగాక మునుపు నీకూ ఉంటుంది. తన నోములు ఫలించి, తన కోర్కెలు తీరి తాను కలలు కన్నవాడే లభించితే ఆమె జీవితం సఫలమైనట్లే. ఆమె హృదయం పొంగిపోతుంది. స్త్రీ జీవితంలో అంతకంటే ఏంగావాలి? అంతకంటె స్వర్గం ఏముంది? ఆమె తన భర్త అందగాడనీ, మంచి హృదయం గలవాడనీ పదిమందిలో చెప్పుకుని గర్విస్తుంది.

నాకు కావల్సింది నా భార్య నుండి ప్రేమానురాగాలు. అవధులు లేని అమరసౌఖ్యాలు. మనస్సువిప్పి, హృదయాన్నర్థం జేసికోగల స్త్రీ నాకు కావాలి. నా అభిప్రాయాలకూ నా భావాలకూ అనువైన నారాధ దొరికింది. అందుకనే ఈనాటికీ గర్విస్తున్నాను. పొంగి పోతున్నాను. కానీ నీలో ఉన్న అపోహలకెంత కృంగిపోతున్నానో తెలుసా? పాముకు తలలో కొంత విషముంటుంది. కాని ఆ విషం వల్లా పాముకు ఏమాత్రం హాని వుండదు. కాని మనిషి హృదయంలో ఏమూలనైనా కాస్తంత అనుమానం వుంటే ఆ మనిషిలోని మానవత్వాన్నే నశింపజేస్తుంది. కాలేసి బలిగొంటుంది. అతడు ప్రశాంతంగా గుండెలపై చెయ్యివేసుకొని నిద్రపోలేడు. కంటిలోని నలుసులా కలత పెడుతూనే వుంటుంది. మనిషి కేమాత్రం అను


మానం వున్నా అతడు మనిషిలా బ్రతుకలేడు. రాధా! అందమంత మోసకరమైనది ప్రపంచంలో ఏదీ లేదు. అది కాలుస్తుంది. చంపుతుంది. నిలువునా నాశనంజేస్తుంది. గుర్తుంచుకో, అందానికి విలు వివ్వకు.'

రాధ చెంపలవెంట నీరు కారుతోంది. చేతులు వణుకుతున్నై. గుండె వేగంగా కొట్టుకొంటూంటే ఊపిరి బిగబట్టి చదువసాగింది.

'నీలో ఉన్న అనుమానం తొలగిపోతే చాలు. నన్నూ నాభావాలూ, పూర్తిగా తెలుసుకో! స్త్రీ పురుషుల్లో ఎవరు చెడినా చెడినట్లే. ఇద్దరూ ఒకటే యీ విషయంలో. నేను మంచిగా వుండి మంచి కోరికలు కోరుకోటం సమంజసం. అంతే గాని నేను తప్పుదోవల్లో నడిచి, ఒకళ్ళను బుద్ధిగా వుండమనటం హాస్యాస్పదం. మనస్సుని కట్టివేయకుండ విచ్చలవిడిగా తిరిగి నేను మంచి వాణ్ణెలానిపించుకోను? నా గత చరిత్ర నక్రమంగా వుంచుకొని భవిష్యత్తుకోసం కలలు గనడం తప్పు లేదు. నేను చెడు తిరుగుళ్ళు తిరిగి నాకొచ్చేబోయే భార్య పవిత్రురాలిగా వుండాలనుకోవటం బుద్ధిహీనత ఆమెకుమాత్రం వుండదా తనకొచ్చేబోయే భర్త పవిత్రుడై వుండాలని. ఈనాడు నా చెడుతనం కప్పిపుచ్చుకొని మంచిగా ప్రవర్తించనా? నేను మంచివాణ్ణని చెప్పి నిన్ను మభ్యపెట్టనా? అంటే నాకు నేను మోసం జేసుకొని తిరిగి నిన్ను మోసగించాలి. ఇంతకంటె ఘోరమైన ఆత్మవంచన లేదు. తిపివూసిన చేదుమాత్రలా ప్రవర్తించ లేను. మేడిపండులాంటి జీవితం భరించ లేను.

ఏ స్త్రీకూడ తన భర్తకు యితర స్త్రీలతో సంబంధం వుందంటే భరించలేదు. ఘోరమైన చిత్రవధ అనుభవిస్తుంది. నరకయాతన పడుతుంది. నరనరాల్లో భయంకరమైన రంపపుకోతను అనుభవిస్తుంది. అటువంటి వేదన, క్షోభను నీకు కల్గించగలనా? నా చదువూ సంస్కారానికిదేనా ప్రతిరూపం? నీలోని అనుమానాన్ని తొలగించుకో. నన్ను పూర్తిగానమ్ము. నీకేనాడూ ద్రోహం తలపెట్టలేదు. నిన్నన్యాయం చెయాలనుకోవటం లేదు.

జయాపజయాలు దైవాధీనం అంటారు, కానీ ఇష్టాయిష్టాలు మానవాధీనం. మనస్సుకి కళ్ళెంవెయ్యటం గాని విచ్చలవిడిగా వదిలేయటంగానీ మన చేతిలోని పని. మనస్సుని పట్టశక్తిగాని, వదిలివేసేశక్తిగాని ప్రతివాని కుంటుంది. కాని ఆ శక్తిని



సరిగ్గా వుపయోగించుకోటంలోనే వుంది, మన గొప్పతనం. ప్రతిమానవుడూ పరిస్థితులకు విచారించాల్సిన పనిలేదు. కానీ తెలుసుండి కల్పించుకొన్న పరిస్థితులవలన వచ్చే కష్టాలకు తప్పకుండా బాధపడాలి. నా మనోవాంఛ నెరవేరి నేను కలలుగన్న సహచారిణి నాకు లభించింది. ఆ గర్వం నాకుంది. నీ మనస్సులో నాటుకుపోయిన అనుమానం,అపోహ తొలగించుకో. నీవు వెళ్ళిపోయిన నాటినుండీ నేననుభవిస్తున్న బాధ ఎవరికీ అర్థంగాదు.

జీవితాల్లో మానవజీవితం ఎంతో ఉన్నతమైంది. జీవిత ఘడియలు స్వల్పమైనా అమూల్యమైనవి.మధురమైనవి. బ్రతికిన కొద్దినాళ్లూ సుఖశాంతులతో గడపాలి. కానీ ఆలోచనా రహితంగా ఉత్కృష్టమైన జీవితాన్ని బలిచేసుకొంటే ఆ జీవితానికి సార్థకతలేదు. ఒక వస్తువుని మనం పట్టుకొని ఆ వస్తువు మనలని వదిలిపెట్టటం లేదనటం అవివేకం. మనం వదిలిపెట్టితే అది పడిపోదా? కష్టాలను మనం పట్టుకొని, అయ్యో! నన్నా కష్టాలు వదలిపోవటం లేదంటే లోకం నవ్వుతుంది. పట్టుకుంది మనంకాని అవిగావు. ఆలోచనా రహితంగా కష్టాలను కొని తెచ్చుకోగూడదు. వివేచనాపూర్వకంగా పరిష్కరించుకోవాలి. జీవన యౌవనాన్ని కష్టాల కప్పగించుకోటంకంటే తెలివితక్కువ పనిలేదు. అంటే మనం గులాబీని వదలి గడ్డి పూవులో వాసనకై వెతికినట్లుంటుంది.

రాధా! ప్రతి చిన్న విషయానికీ నీవు వేరుగా తలంచి బాధపడుతున్నావు. నిర్మలమైన వాతావరణాన్ని కలుషితం చేస్తూ, నిశ్చలమైన నీటిలోనికి రాళ్ళు విసరవద్దు. నా తెరచిన బాహువులు కౌగిలికోసం ఎదురు చూస్తూవున్నై. నీ శంకలు అపోహలు తీసేసుకో. ఈ వుత్తరాన్ని

పూర్తిగా అర్థంచేసికో. నా మనస్సుని పూర్తిగా గ్రహించు. ఏ కాలంలోనైనా, ఎట్టి పరిస్థితుల్లోనైనా నీకు ద్రోహం చెయ్యతలపెట్టను. ఇది ముమ్మాటికి నిజం. నా యీ ఉత్తరాన్ని విశ్వసించి, నన్ను పూర్తిగా అర్థంచేసుకొంటే చాలు. మన జీవితాలు ధన్యమైనట్లే!

ప్రేమతో నీ భర్త,
రాజశేఖర్-

'అమ్మా!' అరిచింది రాధ. నేను వెళ్తున్నానమ్మా. వెళ్తున్నాను. వారి వద్దకు వెళ్తున్నాను. ఇంకా ఒక్క క్షణం నేనిక్కడుండను. ఉండలేను. ఇంత విశాలహృదయం, ఉన్నత భావాలూ కలవారి ననుమానించాను అవమానపర్చాను. దేవుడమ్మా, దేవుడు. నేనే పాపాత్మురాలిని. నా పాపానికి ప్రాయశ్చిత్తం లేదమ్మా. నన్ను క్షమించమనడుగుతానమ్మా' ధారాప్రవాహంగా వస్తున్న కన్నీళ్ల నాపుకోలేకపోయింది వారినెప్పుడూ అనుమానించను. నా పాపానికి నిష్కృతిలేదు. నేనిక వుండలేను. వారి సన్నిధి వదిలివుండలేను.

● మరునాటికే యింటికి చేరిన రాధను. గట్టిగా హృదయానికిహత్తుకుని మెత్తగా ముద్దుపెట్టునాన్నాడు రాజశేఖర్.

